హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	220	240
సూర్యాపేట	రూ.130	192	221
నల్లగొండ	రూ.132	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.5 । కనిష్ఠం 15.6

బీఆర్ఎస్‌లో త్రీమెన్ కమిటీలు?

ఓడిన ఎమ్మెల్యేలపై క్యాడర్‌లో నిరాసక్తత
ఎంపీ ఎన్నికల్లో నిధుల ఖర్చుకు అధిష్ఠానం దూతలు



అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ చతికిల పడింది. 12 అసెంబ్లీ స్థానాలకు 11చోట్ల గులాబీ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీ తేడాతో ఓడిపోయారు. ఇదే అదునుగా ఆయా నియోజకవర్గాల్లో ఇంతకాలం వారిని వ్యతిరేకిస్తున్నవారు కొత్త ప్రతిపాదనలు తెరపైకి తెస్తున్నారు. పార్లమెంటు ఎన్నికలకు ఇన్‌చార్జీలుగా మాజీ ఎమ్మెల్యేలను నియమించకుండా పార్టీ తరపున త్రీమెన్ కమిటీలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

\- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు నియోజకవర్గానికి వారే సీఎంగా వ్యవహరించగా, అందుకు అధిష్ఠానం సైతం పూర్తి మద్దతు ప్రకటించడంతో వారు ఆడిందే ఆటగా మారింది. ఈ నేపథ్యంలో వారి అడుగులకు మడుగులొత్తిన వారినే అందలం ఎక్కించారు. మునిసిపాలిటీలు, పంచాయతీల్లో కాంట్రాక్టు పనులు, పదవులు కట్టబెట్టారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం పంపిణీ వంటి కీలక బాధ్యతలను వారి బంధువులు, స్వగ్రామంలో నమ్మకమైన వారు, వారి సంస్థల్లో ఉద్యోగులను, స్నేహితులకే అప్పగించారు. దీంతో తమ విలువైన రాజకీయ భవిష్యత్తును కోల్పోయామని పలు నియోజకవర్గాల్లోని కీలక నేతలు ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో వారిని నియోజకవర్గ కీలక బాధ్యతల నుంచి తప్పించాలని, బీ-ఫాం ఇవ్వకూడదని ఎన్నికల ముందే చెప్పినా వారి మాట పెడచెవిన పెట్టిన అధిష్ఠానం సిట్టింగులకే టికెట్ కట్టబెట్టింది. అధికార పార్టీ, సిట్టింగ్ ఎమ్మెల్యే అధిష్ఠానం ఇచ్చిన కోట్ల రూపాయలు తీసుకొని ఎన్నికల వేళ మద్యం, డబ్బు పంచకుండా ఏం చేశారని పార్టీలోని కీలక నేతలను ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గుట్టు చప్పుడు కాకుండా పకడ్బందీగా డబ్బు సకాలంలో పంచడంతో ఘోరంగా ఓడిపోయామని నేతలు పేర్కొంటున్నారు. దీన్ని కప్పిపెట్టి కాంగ్రెస్ గాలి వీచింది, రాష్ట్రమంతటా ఇదే పరిస్థితి అంటూ ఎమ్మెల్యే అభ్యర్థులు చెప్పడం పలాయనవాదమేనని వారు వాదిస్తున్నారు. నియోజకవర్గంలో ఓడిన పార్టీ అభ్యర్థి ఆధ్వర్యంలో తాము పనిచేయలేమని, బాధ్యతల నుంచి తప్పించకపోతే కాంగ్రెస్‌లో చేరతామని కుండబద్దలు కొడుతున్నారు. ఈ పరిణామాలన్నీ పరిశీలించిన పార్టీ పెద్దలు గతంలో తెలుగుదేశంలో మాదిరిగా ఓడిన స్థానాల్లో త్రీమెన్ కమిటీ లేదా అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేయాలని పార్టీ అధిష్ఠానానికి ప్రతిపాదిస్తున్నారు. ఒకే వ్యక్తి పాలనతో పార్టీలో నియంతృత్వం పెరుగుతోందని, ముగ్గురు లేదా సీనియర్ నేతలతో కమిటీ ఏర్పాటుచేసి కీలక నిర్ణయాలు అక్కడ చర్చించి ముందుకు వెళ్తేనే పార్టీకి భవిష్యత్తు ఉంటుందనే భావనకు వచ్చారు. పార్టీ ఇచ్చిన నిధులు ఏం చేశారని కొన్ని నియోజకవర్గాల్లో ప్రశ్నలు ఉదయిస్తుండగా, పూర్తిగా అప్పుల్లో ఉన్నామని, ఈ అప్పులు తీరాలంటే మరో రెండు నెలలు వేచి చూడాల్సిందే అని ఓ మాజీ ఎమ్మెల్యే బాకీదారులకు చెబుతున్నట్టు తెలిసింది. మరో బీఆర్ఎస్ అభ్యర్థి క్యాటరింగ్, బాంబుల దుకాణదారులకు, ఫ్లెక్సీల వారికి డబ్బు చెల్లించకుండా ఇంటి చుట్టూ ప్రదక్షిణాలు చేయించుకుంటున్నారు. ఓటమిపాలైన 11 మందిలో ముగ్గురు బీఆర్ఎస్ అభ్యర్థులు ఇప్పటి వరకు నియోజకవర్గం ముఖం చూడకపోవడం గమనార్హం. ఫలితాల విశ్లేషణ, క్రిస్మస్, నూతన సంవత్సరం, పెళ్లిళ్ల వంటి వరుస కార్యక్రమాలు ఉండగా, ఆ ముగ్గురు మాత్రం హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. ఫిబ్రవరి మొదటి వారంలో పార్లమెంటు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. మార్చి 15 నాటికి పోలింగ్ పూర్తవుతుందన్న అంచనా ఉంది. ఫిబ్రవరి మొదటి వారంలోనే అభ్యర్థుల జాబితాలు విడుదల చేసేందుకు ఆయా పార్టీల అధిష్ఠానాలు కసరత్తు చేస్తున్నాయి. ఎమ్మెల్యేలుగా ఓడిన బీఆర్ఎస్ అభ్యర్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని చెబుతున్న నేపథ్యంలో ఎంపీ అభ్యర్థి ఆ నేతల చేతుల్లో డబ్బు పెడితే పరిస్థితి ఏంటనే చర్చ సాగుతోంది. డబ్బును వారు అప్పులకు సర్దుబాటు చేసుకుంటారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో అధిష్ఠానం గుర్తించిన వ్యక్తులే అన్ని నియోజకవర్గాల్లో మకాం వేసి ఎంపీ అభ్యర్థి నిధులు ఆయన ద్వారా ఖర్చు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.



విందు.. వినోదం

- ఆర్టీసీ ఉద్యోగులకు వన భోజనాలు
- రెండు విడతలుగా నిర్వహణ
- నిధుల కేటాయింపు
- సమస్యలు పరిష్కరిస్తే చాలంటున్న ఉద్యోగులు

రోజుకు 10 నుంచి 12గంటలు కష్టపడే ఆర్టీసీ ఉద్యోగుల్లో ఉత్సాహం నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఆర్టీసీ ఉద్యోగులకు వన భోజనాల పేరుతో విందులు ఏర్పాటు చేయనుంది. నేటి నుంచి వారం రోజులపాటు ఈ కార్యక్రమం విడతల వారీగా కొనసాగనుంది. ఇందుకోసం ప్రభుత్వం నిధులు కూడా కేటాయించింది. అయితే తమకు విందులు వద్దని.. సమస్యలు పరిష్కరిస్తే చాలని ఆర్టీసీ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

• 7లో..

అద్దెబస్సు నిర్వాహకులు
సమ్మెకు సన్నద్ధం

- 5 నుంచి సమ్మెకు నిర్ణయం

మహాలక్ష్మి పథకానికి ముందు గతంలో ప్రయాణికుల సంఖ్య ఒక్కో బస్సులో 50నుంచి 60మంది వరకు ఉండేది. తాజాగా ఉచిత ప్రయాణం కారణంగా ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) అమాంతంగా పెరిగింది. దీంతో బస్సులపై అధిక లోడ్ పడుతోంది. బస్సుల వేగం కూడా తగ్గుతోంది. ఫలితంగా తాము నష్టాల బారిన పడుతున్నామని అద్దె బస్సుల నిర్వాహకులు పేర్కొంటున్నారు.

వేతన వెతలు.. నియామకాలకు వినతులు



నెలనెలా వేతనం వస్తేనే కుటుంబం గడిచేది కష్టం. అలాంటిది నెలలకొద్దీ వేతనం రాకుంటే ఎలా అని కస్తూర్బా పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. సంక్రాంతి పండుగకైనా వేతనాలు వస్తాయా అని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా, నాలుగు నెలలుగా విద్యార్థుల మెస్ బిల్లులు రాకపోవడంతో బంగారం తాకట్టుపెట్టి భోజనం పెడుతున్నామని ప్రధానోపాధ్యాయులు బావురుమంటున్నారు. జూన్, జూలై నెలల బిల్లులు డిసెంబరు చివర నాటికి వచ్చాయని, బిల్లులు చెల్లించకపోవడంతో దుకాణదారులు సరుకులు ఇవ్వడం లేదని, దీంతో తమపై ఆర్థికభారం పడుతోందని వారు వాపోతున్నారు. మెస్ బిల్లులతో పాటు సంక్రాంతి పండుగకు నవంబరు, డిసెంబరు వేతనాలు విడుదల చేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

\- కోదాడ



- రెండు నెలలుగా కేజీబీవీ ఉపాధ్యాయుల ఎదురుచూపు
- నాలుగు నెలలుగా రాని మెస్ బిల్లులు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.5.38కోట్ల మేర ప్రభుత్వం బకాయి
- గురుకులాల్లో పోస్టింగుల కోసం ఏళ్లుగా వ్యాయామ ఉపాధ్యాయుల ఎదురుచూపు

ఉమ్మడి జిల్లాలోని నల్లగొండలో 27 పాఠశాలలు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), సూర్యాపేటలో 18, యాదాద్రి జిల్లాలో 8, మొత్తం 53 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలో బోధన, బోధనేతర సిబ్బంది 1,477 మంది వరకు పనిచేస్తున్నారు. కాగా, వారికి నవంబరు, డిసెంబరు రెండు నెలలకు కలిపి రూ.23.13కోట్లు వేతనాలుగా రావాల్సి ఉంది. నెలనెలా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

నాలుగు నెలలుగా రాని మెస్ బిల్లులు

ఉమ్మడి జిల్లాలోని 53 పాఠశాలల్లో సుమారు 15,900 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వారికి మెనూ ప్రకారం పండ్లు, పాలు, కూరగాయలు, నిత్యావసరాలు, ఇతర సామాగ్రికి ఒక్కో పాఠశాలకు నెలకు రూ.2.50లక్షల వరకు ఖర్చు వస్తుంది. 53 పాఠశాలలకు సుమారు రూ.1.32కోట్లు ప్రభుత్వం ప్రతీ నెల విడుదల చేయాల్సి ఉంది. కాగా, నాలుగు నెలలుగా రూ.5.30కోట్ల మెస్ బిల్లులు ప్రభుత్వం బకాయి ఉంది. అటు వేతనాలు, ఇటు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు.



ఎంపికైనా పోస్టింగ్‌ల కోసం ఎదురుచూపు

గురుకులాల్లో 616 వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి 2017లో టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్ష నిర్వహించినా అభ్యర్థులకు నేటికీ పోస్టింగ్‌లు ఇవ్వలేదు. వ్యాయామ ఉపాధ్యాయ విద్య కోసం ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డీపీఈడీ (డిప్లమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్), డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు బీపీఈడీ (బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్) చేస్తారు. కాగా, డీపీఈడీ చేసిన వారు 5నుంచి 8వ తరగతి విద్యార్థులకు, బీపీఈడీ చేసిన వారు 9, 10తరగతి విద్యార్థులకు వ్యాయామ విద్య బోధిస్తారు. ఈ క్రమంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గురుకులాల్లో 616 పోస్టుల భర్తీకి 2017లో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు డీపీఈడీ అర్హతగా పేర్కొంది. నోటిఫికేషన్ వచ్చాక బీపీఈడీ అభ్యర్థులు తమకు అవకాశం ఇవ్వాలని గత ప్రభుత్వాన్ని వేడుకోవటంతో నోటిఫికేషన్‌ను సవరించి తిరిగి విడుదల చేసింది. దీంతో డీపీఈడీ, బీపీఈడీ అభ్యర్థులు పరీక్ష రాశారు. మల్టీజోన్-2 పరిధిలో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రితోపాటు మరిన్ని జిల్లాలకు చెందిన సుమారు 5వేల మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. అనంతరం ఫలితాలు రావడంతో 1:2 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను పిలిచి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో తమకు అన్యాయం జరుగుతోందని డీపీఈడీ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. ఎన్‌సీఈఆర్‌టీ నిబంధనల ప్రకారం కొలువులను నింపాలని కోర్టు ఆదేశించింది. దీనిపై బీపీఈడీ అభ్యర్థులు కోర్టు అప్పీల్‌కు వెళ్లారు. ఈ విషయం ఎటూ తేలకపోవడంతో ఆరేళ్లుగా ఎంపికైన అభ్యర్థులు ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం నియామక నిబంధనల ప్రకారం పోస్టులు భర్తీ చేయాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు.



నియామకాలు చేపట్టాలి



వ్యాయామ ఉపాధ్యాయ పోస్టుకు 1:2 నిష్పత్తి ప్రకారం ఎంపికయ్యా. సర్టిఫికెట్ల పరిశీలన కూడా పూర్తయింది. ఆరేళ్లుగా ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నా. ఎన్‌సీఈఆర్‌టీ నిబంధనల ప్రకారం 5 నుంచి 8 తరగతుల వరకు డీపీఈడీ అభ్యర్థులు అర్హులని తెలిసినా, ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావడంలేదు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం చొరవ తీసుకొని పోస్టులు భర్తీ చేయాలి.

\- ఏ.రాజ్యలక్ష్మి, అభ్యర్థి

నిష్పత్తి ప్రకారం కేటాయించాలి



వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులకు ఒక వేళ బీపీఈడీ అభ్యర్థులను తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తే, 9, 10 తరగతులకు ఎన్ని పోస్టులు వస్తాయో, ఆ నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసి, నియామక ప్రక్రియ పూర్తి చేయాలి. అలా చేయడం వల్ల అభ్యర్థుల్లో ఆందోళన తగ్గుతుంది. అదే విధంగా గురుకుల విద్యార్థులకు న్యాయం జరుగుతుంది.

\- కళ్యాణి, అభ్యర్థి

పెట్రోల్ బంక్‌ల వద్ద బారులు

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన చట్టాల్లో భాగంగా హిట్ అండ్ రన్ (ప్రమాదం చేసి పారిపోతే) కేసులకు శిక్ష పెంపును నిరసిస్తూ ఆయిల్ ట్యాంకర్ల యజమానులు ఆందోళనకు దిగడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ కొరత ఏర్పడింది. దీంతో బంకుల నిర్వాహకులు 'నో స్టాక్' బోర్డు ఏర్పాటుచేయడంతో వాహనదారులు గంటల తరబడి బారులు తీరారు. చివరికి ఆయిల్ ట్యాంకర్ల యజమానులు ఆందోళన విరమించినట్టు సాయంత్రం ప్రకటించడంతో వాహనదారులు ఊరట చెందారు.

• 7లో..



'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోవాలి

ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

దేవరకొండ, జనవరి 2: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజాపాలన' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 15వ వార్డు ఉర్దు మీడియం పాఠశాలలో 'ప్రజాపాలన' దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఆయన తనిఖీచేశారు. దరఖాస్తుదారులతో మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను కౌంటర్ల వద్ద ఉచితంగా ఇస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌ను మునిసిపల్ చైర్మన్ ఆల్లంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రహత్‌అలీ పూల మొక్క అందజేసి సన్మానించారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీరాములు, మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

కొండమల్లేపల్లి: మండలంలోని దేవరోనితండా, చిన్నఅడిశర్లపల్లి గ్రామాల్లో 'ప్రజాపాలన' దరఖాస్తు కేంద్రాలను ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తనిఖీచేశారు. అదేవిధంగా దేవరోనితండాలో ఓ రైతు ఆరబోసిన మిర్చి పంటను పరిశీలించారు. ఈ ప్రాంతంలో 15వేల క్వింటాళ్లకు పైగా మిర్చి పంట సాగై, ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వస్తే మిర్చి పౌడర్ తయారు చేసే పరిశ్రమ ఏర్పాటుకు రూ.2కోట్ల వడ్డీలేని రుణం అందజేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీవో బాలరాజరెడ్డి, తహసీల్దార్ దివ్యరెడ్డి, ఎంపీవో నీలిమా, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు రాకేష్, శ్రీరాములు, తదితరులు ఉన్నారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 'ప్రజాపాలన' దరఖాస్తులు ఇలా..

తేదీ	యాదాద్రి	సూర్యాపేట	నల్లగొండ	మొత్తం
డిసెంబరు 28	11,132	8,809	23,593	43,534
29	20,475	35,109	37,750	93,334
30	35,474	56,874	69,747	1,62,095
31	సెలవు	-	-	-
జనవరి 1	సెలవు	-	-	-
2	39,033	70,953	82,272	1,92,258
మొత్తం	1,06,114	1,71,745	2,13,362	4,91,221

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్ట్‌కు పవిత్ర ఎంపిక

● ఈ నెల 17 నుంచి 20 వ తేదీ వరకు హర్యానాలో కార్యక్రమం ● సైన్స్ కృత్యాలపై అవగాహన కల్పించనున్న పవిత్ర

గరిడేపల్లి, జనవరి 2: కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్‌లో నిర్వహించే ఇండియా, ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి ఉపాధ్యాయురాలు ఎంపికయ్యారు. గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయిని మారం పవిత్రకు ఆహ్వానం అందినట్లు మంగళవారం ఆమె విలేకరులకు తెలిపారు. సైన్స్ ఫెస్టివల్‌లో వివిధ కేటగిరీలలో ఇన్నోవేటెడ్ ఐడియాస్ ఫ్రమ్ టీచర్స్ అండ్ స్టూడెంట్స్ విభాగం నుంచి ఆహ్వానించినట్లు వివరించారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అంతర్జాతీయ, జాతీయస్థాయి శాస్త్రవేత్తలు,



మారం పవిత్ర

వారి ఆవిష్కరణల గురించి చర్చ, ప్రదర్శనలు ఉంటాయన్నారు. తాను పంపిన ఇన్నోవేటివ్ పెడగాజీకి ఎంపిక చేసినట్లు చెప్పారు. హర్యానాలోని ఫరీదాబాద్‌లో ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు ఈ వర్క్‌షాపు కొనసాగుతుందని, వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయస్థాయి రిసోర్స్ పర్సన్‌గా సైన్స్ టీచర్లకు కృత్యాలపై అవగాహన కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. ఇదిలా ఉంటే పవిత్రకు ఆహ్వానం అందడంపై గరిడేపల్లి ఎంపీపీ పెండెం సుజాత శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, సర్పంచ్ సుందరి నాగేశ్వరరావు, ఎంఈవో చత్రునాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు సుశీలమ్మ మృతి

● అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ.. ● సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల మృతదేహం నేడు అప్పగింత

నాగారం, జనవరి 2: స్వాతంత్ర్య సమరయోధురాలు, భారత కమ్యూనిస్టు పార్టీ నాయకురాలు గుంటకండ్ల సుశీలమ్మ(90) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. సుశీలమ్మ నాగారం మండల కేంద్రానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు గుంటకండ్ల పిచ్చిరెడ్డి సతీమణి. గుంటకండ్ల పిచ్చిరెడ్డి సంవత్సరం క్రితం ఆనారోగ్యంతో మృతిచెందారు. సుశీలమ్మ.. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డికి పెద్దమ్మ. సుశీలమ్మ, పిచ్చిరెడ్డిలు సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తున్న సమయంలో వీరిద్దరికి పరిచయం ఏర్పడడంతో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమారుడు అనారోగ్యంతో ఐదేళ్ల క్రితం మృతి చెందారు. గుంటకండ్ల పిచ్చిరెడ్డి నాగారం సమితి ప్రెసిడెంట్‌గా, నాగారం సర్పంచ్‌గా 30 ఏళ్లుగా సీపీఐ నుంచి గెలుపొంది ప్రజలకు సేవలందించారు. సుశీలమ్మ పార్థీవదేహాన్ని ప్రజల సందర్శనార్థం స్వగ్రామం నాగారానికి తీసుకురానున్నట్లు ఆమె చిన్న కుమార్తె కరుణకుమారి తెలిపారు. పార్థీవదేహాన్ని సందర్శన అనంతరం సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించనున్నట్లు వివరించారు.



సుశీలమ్మ (ఫైల్ ఫొటో)

విందు.. వినోదం

- ఆర్టీసీ ఉద్యోగులకు వన భోజనాలు
- నేటినుంచి వారం రోజులపాటు విందులు
- నిధులు మంజూరు చేసిన యాజమాన్యం
- సమస్యలు పరిష్కరించాలి : ఉద్యోగులు





భువనగిరి టౌన్, జనవరి 2: విందు.. వినోదాలతో ఆర్టీసీ ఉద్యోగులను ఉత్సాహపరచనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకం విజయవంతం కావడానికి కృషిచేసిన ఆర్టీసీ ఉద్యోగులను అభినందిస్తూ యాజమాన్యం విందుఇస్తోంది. 'వన భోజనాల' పేరిట ఈ నెల 3వ నుంచి 10వ తేదీ వరకు ఆర్టీసీ ఉద్యోగులకు విందు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం 500 లోపు ఉద్యోగులు ఉన్న డిపోలకు రూ.75వేలు, 500 పైబడి ఉద్యోగులు ఉన్న డిపోలకు రూ.లక్ష మంజూరు చేసింది. డిపో పరిధిలో ఉద్యోగుల విధులకు ఆటంకం కలుగకుండా 2 దఫాలుగా వన భోజనాల విందులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఉద్యోగులలో ఐకమత్యం పెంపొందిస్తూ ఆర్టీసీని లాభాల బాటలో పట్టించే లక్ష్యంతో 2020లో రూపొందించిన ఈ పథకం కొన్ని డిపోలలో అమలయ్యాక మరుగున పడింది. ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతం కావడాన్ని హర్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యాజమాన్యం వన భోజనాల వ్యవస్థను పునరుద్ధరించింది. ఇకనుంచి క్రమం తప్పకుండా ఆర్టీసీ ఉద్యోగులకు విందులు ఉండనున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో గల సుమారు 3,182 మంది ఆర్టీసీ ఉద్యోగులు వన భోజనాల్లో విందులు ఆరగించనున్నారు.

వన భోజనాలు ఇలా..

ప్రతీ డిపో పరిధిలో ఉద్యోగుల సంఖ్య ఆధారంగా ఒకేసారి లేదా రెండు దఫాలుగా వన భోజనాలు ఏర్పాట్లు చేస్తున్నారు. వన భోజనాలతోపాటు తప్పనిసరిగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉండనున్నాయి. అన్నిస్థాయిల ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులు పాల్గొంటారు. మాతృ డిపోల ఉద్యోగులతోపాటు శాటిలైట్ డిపోల ఉద్యోగులు కూడా పాల్గొంటారు. డిపో పరిధిలోనే వన భోజనాలను నిర్వహించుకోవచ్చు. లేదంటే సమీప ప్రాంతాల్లోని సందర్శనీయ స్థలాలకు విహారయాత్రగా వెళ్లి కూడా విందులను ఏర్పాటు చేసుకోవచ్చు. వన భోజనాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సంబంధిత డిపోల అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ తరహా విధానంతో సంస్థపై ఉద్యోగులకు మరింత చిత్తశుద్ధి, గౌరవ భావం పెరుగుతుందని, ఫలితంగా ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందుతాయని, ఆర్టీసీకి ఆదాయం లభిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో డిపోలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో ఏడు డిపోలున్నాయి. వాటి పరిధిలో 640 బస్సులుండగా, 1024 మంది డ్రైవర్లు, 912 మంది కండక్టర్లు, 306 మంది మెకానిక్‌లు, 200 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, 100 మంది అధికారులు, కార్యాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

ఉద్యోగులను ప్రోత్సహించేందుకే..



సంస్థ ఉన్నతికోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ఉద్యోగులను అభినందిస్తూ ప్రోత్సహించేందుకే వన భోజనాలను ఏర్పాటు చేస్తున్నాం. ఆర్టీసీ ఉద్యోగులందరూ వన భోజనాల్లో పాల్గొనాలి. ఉద్యోగుల కృషి ఫలితంగానే రాష్ట్రంలో ఆర్టీసీ మనుగడ సాగిస్తూ ప్రజలకు ప్రయాణ సేవలను అందిస్తున్నది. ఉద్యోగుల శ్రమకు గౌరవం, గుర్తింపు ఉంటుంది. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్తాం.

శ్రీనివాస్‌గౌడ్, డిపో మేనేజరు, యాదగిరిగుట్ట

పెరిగిన ఆదాయం



మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో నష్టాల్లో ఉన్న ఆర్టీసీ లాభాల బాట పట్టిందని అధికారులు అంటున్నారు. బస్సులలో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు అంతేస్థాయిలో ఆదాయం కూడా పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. మహిళలకు జారీ చేస్తున్న జీరో టికెట్ల చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందని పాలకులు ప్రకటించిన నేపథ్యంలో ఇక నుంచి ఆర్టీసీ కష్టాలు తప్పాయంటున్నారు. ఏడు డిపోలు ఉన్న నల్లగొండ ఆర్టీసీ రీజియన్ పరిధిలో మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి రాక ముందు రోజువారీగా సుమారు 2.25లక్షల మంది బస్సుల ద్వారా రాకపోకలు సాగించే వారని, కానీ మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చాక ప్రయాణికుల సంఖ్య సుమారు 3.50లక్షలకు చేరింది. అదే సమయంలో ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని అధికారులు అంటున్నారు.

సమస్యలు పరిష్కరించండి



ఆర్టీసీ అభ్యున్నతికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న తమకు ఇవ్వాల్సింది విందులు కాదని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వాలు, యాజమాన్యాల వైఖరి కారణంగానే గతంలో ఆర్టీసీ నష్టాల్లో కూరుకుపోయి సకాలంలో వేతనాలు కూడా ఇవ్వకున్నా సంస్థను కాపాడుకునేందుకు ఆకలి బాధతోనే విధులు నిర్వహించామని చెబుతున్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉద్యోగుల డిమాండ్లు ఇలా..

- 2017, 2020, 2021 వేతన సవరణలు అమలు చేయాలి.
- డీఏలను క్రమబద్ధీకరించి బకాయిలు ఇవ్వాలి.
- 2013 వేతన సవరణల బకాయి బాండ్‌ల మొత్తాలను ఇవ్వాలి.
- పీఎఫ్, సీసీఎస్ సంస్థలనుంచి యాజమాన్యం వాడుకున్న సొమ్మును జమ చేయాలి.
- విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులన్నింటినీ ఇవ్వాలి.
- ఉద్యోగులపై పని భారాన్ని తగ్గించాలి.
- ఉద్యోగులపై అధికారుల వేధింపులను ఆపాలి.

అద్దెబస్సు నిర్వాహకులు.. సమ్మెకు సన్నద్ధం

- ఈ నెల 5 నుంచి సమ్మెకు నిర్ణయం
- ఓవర్‌లోడ్‌తో నష్టాలు వస్తున్నాయంటున్న యజమానులు



నల్లగొండ, జనవరి 2: ఓ వైపు మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత ప్రయాణం. మరోవైపు ఫ్రీజర్నీతో బస్సుల్లో పెరిగిన ప్రయాణికుల సంఖ్య. వెరసి ఆర్టీసీల్లో అద్దె బస్సులపై నష్టాల ప్రభావం కనిపిస్తోంది. మహాలక్ష్మి పథకానికి ముందు గతంలో ప్రయాణికుల సంఖ్య ఒక్కో బస్సులో 50నుంచి 60మంది వరకు ప్రయాణించగా, తాజాగా ఉచిత ప్రయాణం మూలంగా ఆక్యూపెన్సీ రేషియో(ఓఆర్) అమాంతంగా పెరిగింది. దీంతో బస్సులపై అధిక లోడ్ పడుతోంది. బస్సులవేగం కూడా తగ్గిపోతుందని డ్రైవర్లు చెబుతున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది డిసెంబరు 9వ తేదీ నుంచి మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించిన విషయం తెలిసిందే. దీంతో అద్దె బస్సులపై ప్రభావం పడింది. ఈ పథకంతో ప్రయాణికుల సంఖ్య పెరిగి డీజిల్ భారం పడుతుంది. ఒక్కో లీటర్‌కు ఐదు నుంచి ఆరు కిలోమీటర్ల వరకు బస్సును నడిచేలా ఆర్టీసీ యజమాన్యం టార్గెట్ పెట్టినట్లు సమాచారం. అయితే అద్దెబస్సు యజమాని మాత్రం లీటర్‌కు 4 కి.మీ.లు తగ్గించాలని, లేదంటే తమకు నష్టం వస్తుందని వారు పేర్కొంటున్నారు.

అద్దెబస్సు యజమానుల డిమాండ్లు..

ప్రస్తుతం ఆర్టీసీ అద్దెబస్సుల్లో పల్లెవెలుగులో ప్రయాణించే 56 మంది ప్రయాణికులకు, ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించే 51 మంది ప్రయాణికులకు మాత్రమే అద్దెబస్సు యజమానులు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తారు. అయితే ఉచిత బస్సు ప్రయాణంతో ప్రయాణికుల సంఖ్య 100నుంచి 120కి పెరగడంతో ప్రయాణికుల బీమా ప్రీమియం చెల్లించే అవకాశం ఉండదు. రద్దీ పెరిగితే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రయాణికులకు నష్ట పరిహారం చెల్లించే బాధ్యత అద్దెబస్సు యజమానులపై సంస్థ వేసే అవకాశం ఉండటంతో ఆందోళనకు గురవుతున్నారు. ఓవర్‌లోడ్ వల్ల ఇన్సూరెన్స్‌కు సంబంధించిన ఇబ్బందులు తలెత్తనున్నాయి. దీని దృష్ట్యా ఆర్టీసీ సంస్థనే ఇన్సూరెన్స్ బాధ్యతను భరించాలని కోరుతున్నారు. కరోనా వల్ల ఒక్కో బస్సుకు రూ.5లక్షల నుంచి రూ.8లక్షల అప్పు పెరిగినట్లు సమాచారం. ఓవర్‌లోడ్‌తో మెయింటెనెన్స్ పెరిగి అద్దె బస్సు యజమానులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఫ్లోర్ రేటుకు అదనంగా కిలోమీటర్‌కు రూ.3 పెంచాలని కోరుతున్నారు.

ఓవర్‌లోడ్‌తో దెబ్బతింటున్న బస్సులు

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వల్ల అద్దెబస్సు టైర్లు పగిలిపోతున్నాయి. ఆర్టీసీ యజమాన్యానికి టైర్లు ఏవిధంగా బల్క్ రేటుకు తక్కువ ధరకు ఇస్తున్నారో.., తమకు అదే రేటుకు టైర్లను సరఫరా చేయాలని పేర్కొంటున్నారు. రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో 300లకు పైగా అద్దెబస్సులు ఉన్నాయి. అద్దెబస్సులను ఒక్కో డ్రైవర్ రోజుకు 10 నుంచి 15గంటలు బస్సులు నడపాల్సి వస్తోంది. రోజుకు డ్రైవర్‌కు రూ.1000 వరకు ఇస్తున్నారు. అంటే నెలకు రూ.30వేల వరకు వారికి వేతనం చెల్లించాల్సి ఉంటుంది. సరాసరి ఒక్కో అద్దెబస్సుకు నెలకు రూ.లక్ష వరకు అద్దెరూపంలో సంస్థ ఇస్తుంది. డ్రైవర్లు కూడా దొరక్క బస్సు యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహాలక్ష్మి పథకంతో ఓవర్‌లోడ్ అయి డ్రైవర్లపై ఒత్తిడి పెరుగుతున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా బ్యాంకులనుంచి రుణాలు తీసుకొని బస్సులు నడిపిస్తున్న వారు నష్టాల్లో కూరుకపోవడంతో వారి బస్సులను బ్యాంకులు జప్తు చేస్తున్నట్లు వినికిడి. ఉదాహరణకు యాదగిరిగుట్ట డిపో పరిధిలో 66 అద్దె బస్సులు ఉండగా ఇప్పటికే 30 బస్సులు నష్టాలతో జప్తునకు గురైనట్లు సమాచారం. డిమాండ్ల పరిష్కారంకోసం ఈ నెల 5వ తేదీ నుంచి అద్దెబస్సులు నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర అద్దెబస్సుల యజమానుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఇటీవల తీర్మానం చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఆర్టీసీ సంస్థ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.

అద్దెబస్సుల యజమానులను ఆదుకోవాలి

ఆర్టీసీ యజమాన్యం అద్దెబస్సుల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. బస్సులలో ఓవర్ లోడ్ కారణంగా అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. మైలేజీ తక్కువగా రావడంతోపాటు బస్సుల అద్దాలు, టైర్లు పగిలిపోతున్నాయి. దీనివల్ల అద్దెబస్సు యజమానులకు ఆర్థిక నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వంతోపాటు ఆర్టీసీ సంస్థ వెంటనే సమస్యలు పరిష్కరించాలి. తమ సమస్యలు తక్షణం పరిష్కరించనట్లయితే ఈ నెల 5వ తేదీ నుంచి అద్దెబస్సులను నడిపే పరిస్థితుల్లో యజమానులు లేరు.

బాలవర్ధన్‌రెడ్డి, అద్దెబస్సుల యజమానుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ

పెట్రోల్ కోసం..

మూడు గంటల నిరీక్షణ

- వాహనదారుల వాగ్వాదం
- పలుచోట్ల నోస్టాక్ బోర్డులు



నల్లగొండ జిల్లాకేంద్రంలోని పెట్రోల్ బంక్‌లో వాహనదారుల రద్దీ, ఇన్‌సెట్‌లో నోస్టాక్ బోర్డ్



యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో పెట్రోల్ బంక్‌లో వాహనదారుల రద్దీ



భూదాన్‌పోచంపల్లిలో..



యాదగిరిగుట్టలో..

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్)

పెట్రోల్ బంకుల్లో మంగళవారం గజిబిజి గందరగోళ పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన చట్టాల్లో భాగంగా హిట్ అండ్ రన్ (ప్రమాదం చేసి పారిపోతే) కేసులకు శిక్ష పెంపుపై నిరసన వ్యక్తం చేస్తూ అయిల్ ట్యాంకర్ల యజమానులు ఆందోళనకు దిగారు. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా పలు చోట్ల పెట్రోల్ బంకుల్లో వాహన యజమానులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చింది. నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలో పెట్రోల్‌కోసం ఇబ్బందులు పడగా, సూర్యాపేట జిల్లాలో స్వల్పంగా ఇబ్బందులు తలెత్తాయి. చాలాచోట్ల పెట్రోల్‌బంక్‌ల ఎదుట నోస్టాక్ బోర్డులు దర్శనం ఇవ్వడంతో వాహనదారులు ఆందోళనకు దిగారు. కావాలని పెట్రోల్ బ్లాక్‌లో అమ్మడానికే ఈ విధంగా బోర్డులు పెట్టారని వాహనదారులు ఆరోపించారు.



భువనగిరిలో క్యాన్‌లో పెట్రల్ తీసుకెళుతున్న యువకుడు

- మిర్యాలగూడ మండలంలో వాహనదారులు పెట్రోల్ బంక్‌ల వద్ద పెట్రోల్‌కోసం గంటలకొద్ది క్యూ కట్టారు. మిర్యాలగూడలోని హెచ్‌పి పెట్రోల్‌బంక్‌లో పెట్రోల్ అయిపోయినందున నోస్టాక్ బోర్డును ఏర్పాటు చేయడంతో వాహనదారులు వెనక్కుతిరిగి వెళ్లిపోయారు.
- కోదాడలో బంకుల వద్ద హైటెన్షన్ నెలకొంది. బంకుల వద్ద అరకిలోమీటర్ మేర వాహనాలు నిలిచాయి. బంకు నిర్వాహకులు పెట్రోల్, డీజిల్ కొట్టడానికి ఇబ్బంది పడ్డారు.
- ఆయిల్ ట్యాంకర్ల యాజమానుల సమ్మెతో చండూరులో పెట్రోల్ బంకుల్లో వాహనదారుల తాకిడి పెరిగింది. బంకులో ఉన్న పెట్రోల్ అయిపోవడంతో చివరికి నో స్టాక్ బోర్డు పెట్టారు.
- భువనగిరి పట్టణంలో సాయంత్రం నుంచి పెట్రోల్, డీజిల్ కోసం బంక్‌లకు పరుగులు తీశారు. దీంతో అన్ని బంక్‌ల్లో వాహనాల రద్దీ నెలకొన్నది. ఇందనం కోసం వాహనదారులు పోటీ పడటంతో పాటు బంక్‌ల సిబ్బందితో వాగ్వివాదాలకు దిగారు. రాత్రి వరకు బంక్‌లలో నిలువలు ఆవిరి కావడంతో పలు బంక్ యాజమాన్యాలు నో స్టాక్ బోర్డులు తగిలించాయి.
- భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్‌లో పెట్రోల్, డీజిల్ కోసం బంకులవద్ద వందలాది మంది బారులుతీరారు. దీంతో కొన్ని పెట్రోల్ బంకులు ముందస్తుగా నోస్టాక్ బోర్డులు పెట్టారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



బుచ్చయ్య(ఫైల్)

నేరేడుచర్ల, జనవరి2: తాటి చెట్టుపై నుంచి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ముకుందాపూరంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పరమేష్, స్థానికుల వివరాల ప్రకారం.. ముకుందాపురం గ్రామానికి చెందిన గీతకార్మికుడు బొమ్మకంటి బుచ్చయ్య(67) సోమవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతున్న ఆయన సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. బుచ్చయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు. భార్య వీరమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆత్మహత్యకు పాల్పడిన వారి ఆచూకీ లభ్యం

- ఏపీ రాష్ట్రం శ్రీకాకుళంకు చెందినవారిగా గుర్తింపు



గోవిందరావు, ఆదిలక్ష్మి(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, జనవరి 2: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలో గత నెల 31న రైలు పట్టాలపై ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మిస్టరీని రైల్వే పోలీసులు మంగళవారం ఛేదించారు. మిర్యాలగూడ ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్, జీఆర్‌పీ ఎస్‌ఐ సాకలమ్మలు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా పోలంకి మండలం ముబగం గ్రామానికి చెందిన సత్తివాడ గోవిందరావు (23) వరికోత మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా గోవిందరావు తన సమీప గ్రామమైన తలసముద్రానికి చెందిన పోతల ఆదిలక్ష్మి(36)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. వీరిరువురు గత నెల 29న ఇంటి నుంచి బయటకు వచ్చి రైలు మార్గంలో హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధపడ్డారు. మార్గంమధ్యలో వీరు మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో డిసెంబర్ 30న అర్ధరాత్రి దిగారు. ఆ తర్వాత 31వ తేదీన తెల్లవారుజామున మిర్యాలగూడ-నడికుడి రైల్వేమార్గంలో 115వ మైలురాయి వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఛిద్రమైన ఇరువురి మృతదేహాలను స్వాధీనపరుచుకున్న రైల్వే పోలీసులు ఆచూకీ తెలుసుకునేందుకు ఏపీ, తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు మృతదేహాల ఫొటోలను పంపించారు. మృతుడు గోవిందరావు ఎడమచేతిపై ఉన్న రామలక్ష్మణ పచ్చబొట్టు ఆధారంగా శ్రీకాకుళం జిల్లా పోలంకి మండలం ముబగం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి ఆ తర్వాత అతనితో కలిసి వచ్చిన మహిళ ఆదిలక్ష్మిగా నిర్ధారించారు. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ సాకలమ్మ తెలిపారు.

చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : డీసీపీ

భువనగిరి టౌన్, జనవరి 2: చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు, శిక్షలకు గురికావాల్సి వస్తుందని డీసీపీ రాజేష్ చంద్ర అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం పుస్తకాన్ని మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో విడుదలచేసి మాట్లాడారు. చట్టాలను దుర్వినియోగం చేయవద్దని సూచించారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకుంటే నేర ప్రవృత్తి నుంచి దూరం కావచ్చన్నారు. చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిదన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవికుమార్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సురిపంగ శివలింగం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్, కుల వివక్ష పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అన్నంపట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనుల అడ్డగింత



రహదారి పనులను అడ్డుకుంటున్న గ్రామస్థులు

మోత్కూరు, జనవరి 2: వలిగొండ- తొర్రూరు జాతీయ రహదారి పనులను మంగళవారం మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామ రైతులు అడ్డుకున్నారు. రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల మీదకు వెళ్లకుండా జాతీయ రహదారి నిర్మాణ పనులు చేస్తున్న వారు ఎక్స్‌కవేటర్‌తో పెద్ద గోతులు తవ్వి మట్టిని తీయడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ వ్యవసాయ క్షేత్రాల మీదకు ఎలా వెళ్లాలని వారు ప్రశ్నించారు. తమ వ్యవసాయ క్షేత్రాల మీదకు వెళ్లేలా దారులు వదలాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంగారు ప్రభాకర్, కుర్మేటి విక్రం, గిరగాని శ్రీను, గుండ రాములు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

- యాదగిరిక్షేత్రంలో ఘనంగా ధనుర్మాసపర్వాలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి2: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో మంగళవారం స్వామికి నిత్యవిధి కైంకర్యాలు, క్షేత్రపాలకుడు అంజనేయస్వామికి నాగవల్లీదళార్చనలు, ధనుర్మాసోత్సవాలు వైభవంగా కొనసాగాయి. వేకువ జామున సుప్రభాతంతో లక్ష్మీనృసింహులను మేల్కొలిపిన అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి, అనుబంధ పాతగుట్ట దేవాలయం, పుష్కరిణి, శివాలయంలో కొలువుదీరిన ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకబృందం, వేద పండితులు పంచామృతాలతో అభిషేకించారు. సింధూరం, వివిధ రకాల పూల మాలలతో అలకరించి నాగవల్లీదళాలు(తమలపాకులతో) సహస్రనామార్చనలు నిర్వహించారు. ప్రధానాలయ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్యతిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్యపూజలు, యాగశాలలో రుద్రహవనం స్మార్త సంప్రదాయరీతిలో నిర్వహించారు. అదే విధంగా యాదగిరీశుడి సన్నిధిలో మంగళవారం ధనుర్మాసపర్వాలు ఘనంగా కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.34,03,376 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

ప్రియుడే చంపేశాడు

- మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటగిరి



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటగిరి

త్రిపురారం, జనవరి 2: నల్లగొండ జిల్లా త్రిపురారం మండలంలోని బాబుసాయిపేటలో గత నెల 28న కొండమీది స్వాతి అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఆమె తండ్రి సైదులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడంతో మిస్టరీ వీడింది. ఆమె ప్రియుడు ఊపిరాడకుండా చేసి స్వాతిని హత్య చేసినట్లు తేలింది. త్రిపురారం పోలీస్‌స్టేషన్‌లో మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి హత్యకు సంబంధించిన వివరాలను మంగళవారం వెల్లడించారు. ఏడేళ్ల క్రితం స్వాతిని నిడమనూరు మండలం ఇండ్లకోటయ్యగూడెం గ్రామానికి చెందిన ఉదయగిరి నారాయణకిచ్చి వివాహం జరిపించారు. అప్పట్లో తన భర్తతో కలిసి పనికి వెళ్లేది. అదే గ్రామానికి చెందిన దోరేపల్లి శ్రీరాములు అనే వ్యక్తితో స్వాతికి పని దగ్గర పరిచయం ఏర్పడి వారిద్దరి మధ్య వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. స్వాతి పెళ్లయిన 3 సంవత్సరాలకు ఆమె పుట్టిల్లు అయిన బాబుసాయిపేట గ్రామానికి వచ్చేసింది. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. శ్రీరాములు తరచూ స్వాతి వద్దకు వస్తూ ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి వివాహేతర సంబంధం కొనసాగించాడు. అతను ఏడాది క్రితం స్వాతికి తెలియకుండా మరో యువతిని వివాహం చేసుకోగా, వారికి ఒక అబ్బాయి జన్మించాడు. స్వాతి నుంచి తరుచూ ఫోన్లు వస్తుండటంతో శ్రీరాములు భార్యకు అనుమానం వచ్చింది. భర్తను నిలదీయగా ఆమెకు కొంత నగదు ఇవ్వాలని నమ్మబలికాడు. భర్త వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు భార్యకు అనుమానం వచ్చి పెద్దమనుషులను ఆశ్రయించింది. పంచాయితీ పెడితే సంబంధం బయటపడి భార్య, కుమారుడు దూరమవుతాడని భావించిన అతను స్వాతిని అంతమొందించాలని అనుకున్నాడు. స్వాతికి గత నెల 28వ తేదీన ఫోన్‌చేసి మాట్లాడాలని చెప్పాడు. అదే రోజు రాత్రి మోటారు సైకిల్‌పై బాబుసాయిపేట వెళ్లాడు. ఇంటి నక్కన ఉన్న మేకల షెడ్డులో పడుకుని ఉన్న స్వాతి వద్ద మాట్లాడుతుండగా ఆమె కుటుంబ సభ్యులు ఎవరితో మాట్లాడుతున్నావని అడగగా, తన భర్తే వచ్చినట్లు చెప్పింది. ఇంటి పక్కన ఖాళీ ప్రదేశంలోకి ఆమెను తీసుకెళ్లి చంపేశాడు. మృతదేహాన్ని పాకలో పడేసి వెళ్లాడు. స్వాతి సెల్‌ఫోన్ తీసుకుని దుగ్గేపల్లి శివారులో తన మామ సైదులు ఉంటున్న తోట వద్దకు వెళ్లాడు. కేసు దర్యాప్తులో భాగంగా గత నెల 29న అనుమానితుడు ఆచూకీ తెలుసుకున్న పోలీసులు శ్రీరాములును అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన సీఐ గాంధీనాయక్, ఎస్‌ఐ వీరశేఖర్, ఏఎస్‌ఐ రామయ్య, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ప్రీమెట్రికా.. పోస్టు మెట్రికా?

● ఆరు నెలలుగా రెండు హాస్టళ్లుగా నార్కట్‌పల్లి బీసీ హాస్టల్


నార్కట్‌పల్లిలోని బీసీ ప్రత్యేక బాలుర హాస్టల్

నార్కట్‌పల్లి, జనవరి 2: నార్కట్‌పల్లిలోని బీసీ బాలుర వసతి గృహం నిర్వహణపై గందరగోళం నెలకొంది. ఈ హాస్టల్‌ను ప్రీ మెట్రిక్ (పాఠశాల స్థాయి) వసతి గృహమా లేక పోస్ట్‌మెట్రిక్ (కాలేజీ హాస్టల్) వసతి గృహంగా పరిగణిం చాలో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతానికి ఇదే హాస్టల్‌లో కళాశాల, పాఠశాల విద్యార్థులకు భోజన, నివాస వసతి కల్పిస్తున్నారు. బిల్లుల సమర్పించే విషయంలో సమస్యలు తలెత్తే అవకాశమేర్పడింది. రెండు వసతి గృహాలకు వేర్వేరు కోడ్ నెంబర్లు కేటాయించాల్సి ఉంది. ఒకే భవన సముదాయంలో నిర్వహించే వసతి గృహాలకు రెండు వేర్వేరు కోడ్ నెంబర్లు ఇవ్వడం కుదరదని అధికారులు చెబుతున్నారు. దీంతో ఆరు నెలలుగా సొంత ఖర్చుతో హాస్టల్ నిర్వహిస్తున్న వార్డెన్ ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ఇటీవల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులకు దృష్టికి తెచ్చారు.

సమస్యకు కారణమిదీ

నిర్ణీత సంఖ్యలో విద్యార్థులు నమోదవ్వని ప్రీ మెట్రిక్ హాస్టళ్లను పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లుగా మార్చాలని బీసీ సంక్షేమ శాఖా అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే నల్లగొండ జిల్లాలో ఈ కోవలోకి వచ్చేవిగా గుర్తించిన ఐదు ప్రీమెట్రిక్ హాస్టళ్ల జాబితాలో నార్కట్‌పల్లిలోని బీసీ బాలుర ప్రత్యేక వసతి గృహం కూడా ఉంది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో కూడా ప్రీమెట్రిక్ హాస్టల్‌గానే నిర్వహించేందుకు ఏఎస్‌డబ్ల్యూవో రిన్యూవల్ చేసింది. దీంతో పాటు అడ్వయిజరీ కమిటీ ఆమోదం మేరకు కూడా ఈ పర్యాయం 20మంది విద్యార్థులను రెన్యూవల్ చేయగా దాదాపు 60మంది కొత్తగా విద్యార్థులను చేర్పించారు. కానీ కొన్ని రోజులకే ఈ హాస్టల్‌ను పోస్ట్‌మెట్రిక్‌గా మారుస్తున్నామని, ఇందులో చేరిన విద్యార్థులను పరిసర మండలాల్లోని వసతి గృహాలకు బదలాయించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. అప్పటికే స్థానిక పాఠశాలల్లో నమోదై హాస్టల్‌లో చేరిన విద్యార్థులు వేరే హాస్టళ్లకు వెళ్లడానికి అయిష్టత చూపారు. ఫైగా హాస్టల్ (రద్దు) కేడర్ మార్పు విషయాన్ని ఎమ్మెల్యే, జడ్పీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా హాస్టల్‌ను కొనసాగించాలని, అవసరమైతే అధికారులతో మాట్లాడతామని చెప్పారు.

సర్దుకుని నిర్వహించేలా ఆదేశాలు

నార్కట్‌పల్లికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరవడంతో బీసీ బాలుర హాస్టల్‌లోనే విద్యార్థులకు వసతి కల్పించేలా అప్పటి ఎమ్మెల్యే కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తిచేశారు. ఎమ్మెల్యే, జడ్పీ ఛైర్మన్ విజ్ఞప్తులతో స్పందించిన కలెక్టర్ ఆదేశాలతో ఇదే హాస్టల్‌ను పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌గా గుర్తిస్తూనే ప్రీమెట్రిక్ హాస్టల్‌గా కూడా సర్దుబాటు చేసుకుని నిర్వహించాలని సూచిస్తూ ఆగస్టు 23న జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌గానే గుర్తిస్తూ కోడ్ నెంబర్ ఇచ్చారు. పోస్టుమెట్రిక్ విద్యార్థుల సంఖ్య 10గా ఉంటే ప్రీమెట్రిక్ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో ప్రీ మెట్రిక్ హాస్టల్ కోడ్ కేటాయించకపోవడంతో వసతి గృహ నిర్వహణ బిల్లులను పెట్టేందుకు అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యే నిత్యావసరాలు పోగా ఇతర నిత్యావసరాలను వార్డెన్ సొంత ఖర్చుతో సమకూరుస్తున్నారు.



పాఠశాల, కళాశాల విద్యార్థులు ఉన్నారు

హాస్టల్‌లో కాలేజీ, పాఠశాల విద్యార్థులకు వసతి కల్పిస్తున్నాం. ఈ హాస్టల్‌ను పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌గా గుర్తిస్తున్నామని అధికారులు ఆదేశించినా అప్పటికే ప్రీ మెట్రిక్ విద్యార్థులను కొత్తగా నమోదు చేసుకున్నాం. వారు ఇతర హాస్టళ్లకు వెళ్లలేమని చెప్పడంతో ఇదే మండలానికి చెందిన ఎమ్మెల్యే, జడ్పీ ఛైర్మన్‌ల సూచన మేరకు కొనసాగిస్తున్నాం.

● దయాకర్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్

పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌గానే గుర్తిస్తాం

నార్కట్‌పల్లి బీసీ బాలుర హాస్టల్‌ను ప్రీ మెట్రిక్‌గా కాకుండా పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌గానే అధికారికంగా గుర్తిస్తున్నాం. ఇందులో ఎలాంటి మార్పులేదు. ఉన్నతాధికారుల సూచనలు, శాఖాపరమైన నిర్వహణ నిబంధనల మేరకు ఈ విషయాన్ని వార్డెన్‌కు లిఖితపూర్వకంగా తెలియజేశాం. ఒకే హాస్టల్‌కు రెండు కోడ్‌లు కేటాయించడం కుదరదు.

● కృష్ణవేణి, ఏఎస్‌డబ్ల్యూవో.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

మర్రిగూడ, జనవరి 2: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి కోరారు. మర్రిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టి పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను వచ్చే విద్యా సంవత్సరం నాటికి నూతన రిక్రూమెంట్ ద్వారా భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షురాలు పరమేశ్వరీ, ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా ప్రతినిధి సుందరయ్య, ఉపేందర్, శ్రీనయ్య, శ్రీలత, మంజుల, హేమలత పాల్గొన్నారు.

గుండెపోటుతో పారామెడికల్ ఆఫీసర్ మృతి

నాగార్జునసాగర్, జనవరి 2: నాగార్జునసాగర్ హిల్‌కాలనీకి చెందిన డీపీఎంవో(డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్) ఎడ్ల సృజయనాథ్(57) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. తన కుటుంబసభ్యులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు కలిసి జరుపుకుంటున్న సమయంలో రాత్రి 10గంటలకు ఛాతిలో నొప్పి రావడంతో ఆయనను వెంటనే స్థానిక కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. సృజయనాథ్ లెప్రసీ నిర్మూలన విభాగంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్‌గా దేవరకొండలో విధులు నిర్వహిస్తున్నారని కుటుంబసభ్యులు తెలిపారు.

పరిశ్రమ వ్యర్థాలు బావుల్లో పోయొద్దు

చిట్యాల రూరల్, జనవరి 2: మండలంలోని వెలిమినేడు శివారులో ఉన్న ఎంపీఎల్ స్టీల్ ఇండస్ట్రీస్ పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలు(డస్టును) బావుల్లో పారబోస్తున్నారని దాని ద్వారా రైతులకు నష్టం కలుగుతుందని వెలిమినేడు ఎంపీటీసీ-1 దేశబోయిన స్వరూపనర్సింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమ వల్ల సుమారు 10గ్రామాల ప్రజలు కాలుష్యం వల్ల ఇబ్బందులు పడుతున్నారని దుమ్ము, దూళితో పంటపొలాలు, భూగర్భజలాలు కలుషితమయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని, ఎంపీఎల్ పరిశ్రమ విస్తరణను నిలిపివేసి ప్రజలకు నష్టం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


వేములపల్లి: మొల్కాపట్నంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్


చిట్యాల: తాళ్లవెల్లంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం


కట్టంగూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వేములపల్లి, జనవరి 2: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి(బీఎల్ఆర్) అన్నారు. మండలంలోని మొల్కపట్నం, ఆమనగల్లు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన సభలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీ పథకాలకు అందరూ సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్హులను గుర్తిస్తారని తెలిపారు. రేషన్‌కార్డు లేదని ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం త్వరలో రేషన్‌కార్డులు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత, సర్పంచులు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, వల్లంపట్ల ఝాన్సీప్రవీణ్, ఎంపీటీసీ పల్లా వీరయ్య, ఉప సర్పంచులు రెమడాల కరుణాకర్, నగేష్, నాయకులు పేరెల్లి నగేష్, పిల్లల సందీప్, కొమ్మనబోయిన మంగమ్మ, ఎంపీడీవో జానయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ, డీటీ నిర్మలాదేవి, ఆర్ఐ మహేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బూరుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ రూరల్: అర్హులందరికీ అభయహస్తం పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. యాద్గార్‌పల్లిలో దరఖాస్తులు స్వీకరించారు. రేషన్‌కార్డు లేనివారు తెల్ల కాగితంపై రాసి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతిలక్ష్మీ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజాధనం వృథా అయిందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లిలో దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మంచి పాలన అందిస్తుందన్నారు. నార్కట్‌పల్లి డిపోకు పూర్వవైభవం తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూదిమెట్ల స్రవంతి, ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి మల్లయ్య, ఎంపీడీవో యా దగిరి, ప్రదీప్, కాంగ్రెస్ నాయకులు బత్తుల ఊశయ్య, అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, సట్టు సత్తయ్య, అలుగుబెల్లి వివేక్ పాల్గొన్నారు.

నకిరేకల్: ఆరు గ్యారెంటీ పథకాలతో ప్రజలకు న్యాయం జరుగుతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఆయన దరఖాస్తులు స్వీకరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం 48గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, ఆరోగ్యశ్రీ 10లక్షలకు పెంపు చేసిందన్నారు. అనంతరం మండలంలోని నెల్లిబండ గ్రామీణ ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఎంపీడీవో దీన్‌దయాళ్, కాంగ్రెస్ నాయకుడు ధైద రవీందర్ పాల్గొన్నారు.

చిట్యాల రూరల్: కాంగ్రెస్ పాలనలో అందరికీ న్యాయం జరుగు తుందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని వట్టిమర్తి, తాళ్ళవెల్లంల గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడారు. ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 48గంటల్లోనే ఏడుగురు మంత్రులతో సమీక్ష నిర్వహించిందన్నారు. తాళ్ళవెల్లంలలో గ్రామపంచాయతీ కార్మికులు ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని సన్మానించారు. ఎమ్మెల్యేగా వేముల వీరేశం విజయం సాధించడంతో తాళ్ళవెల్లంల సర్పంచ్ జనగాం రవీందర్‌గౌడ్, ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మయ్య ఎమ్మెల్యే సమక్షంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

నిడమనూరు: మండలంలోని నిడమనూరు, ముప్పారం, ఊట్కూరు, వెంగన్నగూడెం గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమోద్‌కుమార్, సర్పంచులు మేరెడ్డి పుష్పలత, నర్సింగు విజయ్‌కుమార్, అంకతి సత్యం, ముంగి శివమారయ్య, విశ్వనాధుల రమేష్, ఉన్నం చినవీరయ్య, బాస్కారి నారాయణ, సూపరింటెండెంట్ రమేష్, ఏపీవో శ్రీనివాస్, కార్యదర్శులు మధుసూదన్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు. కొన్ని గ్రామాల్లో దరఖాస్తులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

కట్టంగూరు: అర్హులందరికీ పథకాలు అందుతాయని ఎంపీపీ జెల్లా ముత్తిలింగం అన్నారు. మండలంలోని బొల్లేపల్లి, మునుకుంట్ల, పరడ గ్రామాల్లో జరిగిన ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పోరెండ్ల సునీత, వైస్ ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, సర్పంచులు గడుసు అనితసుధీర్‌రెడ్డి, పుట్ట సృజనవెంకట్‌రెడ్డి, సరిత, ఎంపీటీసీలు మాద యాదగిరి, వల్లపు నాగలక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో పర్వేజ్, నాయకులు యాదగిరి, సుంకరబోయిన నర్సింహ ఉన్నారు.

శాలిగౌరారం: మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని జడ్పీటీసీ ఎర్ర రణీలయాదగిరి అన్నారు. మండలంలోని అడ్లూర్‌లో జరిగిన ప్రజాపాలన సభలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్, సర్పంచ్ బోడ నర్సయ్య, భూపతి అంజయ్య, నల్లగొండ శ్రీనివాస్, చిత్తలూరి వెంకన్న, బోడ విజయ్, భాస్కర్ ఉన్నారు.

గట్టుప్పల్: అభయహస్తం పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ లావణ్య అన్నారు. మండలంలోని తేరటిపల్లిలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, సర్పంచ్ వీరమల్ల శ్రీశైలంగౌడ్, ఎంపీటీసీ సత్తయ్య ఉన్నారు.

చిట్యాల: చిట్యాల మున్సిపాలిటీలోని 10, 11, 12వ వార్డుల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, కౌన్సిలర్లు రెమిడాల లింగస్వామి, సిలివేరు మౌనిక, గోధుమగడ్డ పద్మ, నాయకులు పోకల దేవదాస్, ఏనుగు అంజిరెడ్డి, జడల చినమల్లయ్య, సాగర్ల గోవర్ధన్, జిట్ట చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: మండలంలోని 25గ్రామపంచాయతీల్లో మంగళవారం వరకు 7,493 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో శర్మ తెలిపారు. మున్సిపాలిటీలో 5283 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ వెంకటయ్య తెలిపారు.

చింతపల్లి: ప్రజాపాలనతో ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని మండల ప్రత్యేకాధికారి కృష్ణవేణి, తహసీల్దార్ ఎం.డి. శంషోద్దీన్, ఎంపీ డీవో రాజు అన్నారు. మండలంలోని షాకలిశేరిపల్లి, గొల్లపల్లి, కృష్ణరాయణపల్లి, ఘడియాగౌరారం గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ అర్షద్, పంచాయతీ అధికారి వెంకన్న పాల్గొన్నారు.

కనగల్: మండల పరిధిలోని దోరెపల్లిలో ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాన్ని ఎంపీడీవో సోమసుందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ఐతగోని యాదయ్యగౌడ్, ఉప సర్పంచ్ దాసరి వెంకన్న, పీఆర్ ఏఈ శ్రీనివాస్, కార్యదర్శి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని 31గ్రామ పంచాయతీల్లో మంగళవారం వరకు 16 గ్రామ పంచాయతీల్లో ఐదు గ్యారెంటీలకు దరఖాస్తులు 8,197 వచ్చినట్లు పీఏపల్లి ఎంపీడీవో అజ్మీరా దేవికా తెలిపారు.

మాడ్గులపల్లి : ప్రజాపాలన ప్రజలకు మేలు జరుగుతుందని జడ్పీటీసీ పుల్లెంల సైదులు అన్నారు. మండలంలోని చెరువుపల్లి, నారాయణపురం, మాచినపల్లి, గుర్రప్పగూడెం గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించారు. కల్వలపాలెంలో ఎంపీపీ పోకల శ్రీవిద్య దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చెన్నయ్య, తహసీల్దార్ జమీరొద్దిన్, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, ఆర్ఐ అక్తర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

హాలియా: అనుముల మండలంలోని చింతగూడెం, రామడుగు, పేరూరు గ్రామాల్లో, హాలియా మున్సిపాలిటీలోని వార్డుల్లో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయశ్రీ, ఎంపీడీవో లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డి, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, సర్పంచులు యడవల్లి నాగమణి నాగరాజు, కౌన్సిలర్లు దేపావత్ ప్రసాద్‌నాయక్, మజ్జిగపు అశోక్‌రెడ్డి, పాండునాయక్, నెర్మటి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యే బాలునాయక్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

దేవరకొండ, జనవరి 2: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రేషన్ డీలర్లు పౌరసరఫరాల శాఖ నుంచి వచ్చే రేషన్ సరుకులను లబ్ధిదారులకు సరఫరా చేయాలన్నారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు తాలేపల్లి నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్ డీలర్లకు ప్రతి నెలా రూ. 5వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి వైద్యుల సత్యానారాయణ, కోశాధికారి సూర్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు కొర్ర శంకర్ నాయక్, చిలువేరు శ్రీనివాస్, పగిళ్ల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

చింతపల్లి : వీటీనగర్‌లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. వీటీ.నగర్‌లో అధికారులతో కలిసి మంగళవారం ఆయన డ్రైనేజ్‌ను పరిశీలించారు. రాష్ట్ర రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీ నుంచి వచ్చే మురుగు నీటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండూరు భవానిపవన్‌కుమార్, సర్పంచ్ కొండూరు శ్రీదేవి, ఆర్ ఎండ్ బీ ఈఈ ఖాజన్‌గౌడ్, నాగభూషణం, గోవర్ధన్, ఉన్నారు.

గడప గడపకూ రాముడి అక్షింతలు


మర్రిగూడలో అక్షింతలతో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

మర్రిగూడ, జనవరి 2: అయోధ్యలో రాముడి అంక్షితలను రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. బజరంగ్‌దళ్ తెలంగాణ రాష్ట్ర కోకన్వీనర్ వెంకటేష్ మాట్లాడుతూ అయోధ్య భవన ఆలయ నిర్మాణం కోసం ప్రజలు ఇచ్చిన చందాలను దృష్టిలో పెట్టుకుని అంక్షితలు పంపిణీ చేస్తునట్లు తెలిపారు. స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో అంక్షితలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్, పోనుగోటి విజయరామరావు, పిట్టల శ్రీనివాస్, సర్పంచ్ నల్ల యాదయ్యగౌడ్, యాదగిరి, దామోదర్‌రావు, రామలింగం, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అక్షింతల పంపిణీ మంగళవారం కొనసాగింది. ట్రస్ట్ సభ్యులు వాడవాడలా తిరుగుతూ అక్షింతలను ఇంటింటికీ పంచిపెట్టారు. అయోధ్య రామాలయంలో విగ్రహ ప్రతిష్ట రోజున అక్షింతలను పూజించి తలపై చల్లుకోవాలన్నారు.

ఇంజనీర్లకు న్యాయం చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఇంజనీర్లు

దామరచర్ల, జనవరి 2: తమకు న్యాయం చేయాలని తెలంగాణ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అసోసియేషన్, యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమకు చెందిన ఇంజనీర్లు కోరారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డినికి మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ ఇంజనీర్లకు టీఎస్ జెన్‌కలో పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని వారు వినతి పత్రంలో తెలిపారు. ఆంధ్రా ఇంజనీర్లకు అధిక ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణ ఇంజనీర్లకు నియామకాల్లో సముచిత స్థానం కల్పించలే దన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గిరిబాబు, రామకృష్ణ, వెంకటనారాయణ, హాతీరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలి

నల్లగొండ, జనవరి 2: విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయాలని డీఈవో భిక్షపతి అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరాం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పాపిరెడ్డి, కంచనపల్లి విజయ్‌కుమార్, మల్లికార్జున్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, బాలు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ఇనుపాముల వాసి శ్రీదేవికి డాక్టరేట్



నకిరేకల్, జనవరి 2: మండలంలోని ఇనుపాముల గ్రామానికి చెందిన చందా శ్రీదేవి ఉస్మానియా యూనివర్సిటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నుంచి డాక్టరేట్ పొందారు. ఇనుపాముల గ్రామానికి చెందిన చంద బాలయ్య, ఫెరోజమ్మ కూతురు శ్రీదేవి ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తిచేసి ప్రొఫెసర్ ఆర్ సంపత్‌కుమార్ పర్యవేక్షణలో 'ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీలో మహిళలు పురోగతిలో ఎదుర్కొంటున్న సమస్యలు' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. పరిశోధనలో భాగంగా దుబాయ్‌లో జరిగిన సదస్సులో శ్రీదేవి చేసిన ఉపన్యాసం చేశారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లోని లిటిల్ ప్లవర్ జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. శ్రీదేవిని మాజీ వైస్ ఎంపీపీ కంచర్ల అరుణ మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ బొజ్జ సుందర్, కత్తుల దయాకర్‌రెడ్డి తదితరులు అభినందించారు.

తెల్ల కాగితంపై రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేయొచ్చు

రామగిరి, జనవరి 2: కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారు తెల్లకాగితంపై రాసి ఇస్తే సరిపోతుందని మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని 19, 20, 22, 23, 24వ వార్డుల్లోని కమ్యూనిటీ హాళ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా వార్డ్ ఆఫీసర్లు దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. కొత్త రేషన్‌కార్డు కోసం ప్రభుత్వం వద్ద నుంచి ఎలాంటి ఫార్మెట్ రాలేదని, వాట్సాప్ వచ్చే ఫార్మట్లను నమ్మొద్దని సూచించారు. జిరాక్స్ సెంటర్లకు వెళ్లి దరఖాస్తు ఫారాలను తీసుకోవద్దన్నారు. కావాల్సినన్ని దరఖాస్తులను అందుబాటులో ఉంచామని, 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రెవిన్యూ అధికారి కాజా ఆరిఫోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

మిర్యాలగూడ టౌన్, జనవరి 2: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని వాసవీ, వనిత, కుసుమాంబ క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ రాయపుడి భవానీ అన్నారు. పట్టణంలోని బోటింగ్ పార్కులో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. క్లబ్ సభ్యులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం హర్షనీయ మన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన క్లబ్ సభ్యులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరునగరు పద్మ, భోనగిరి లావణ్య, గుండా లక్ష్మీ, తల్లం పుష్ప, కొండూరు ఇందిర, కొప్పోలు రమాదేవి, గంధం లీలారాణి, సిమ్మి, వీ. పద్మ పాల్గొన్నారు.

కట్టంగూరు, జనవరి 2: మండలంలోని మునుకుంట్ల గ్రామంలో 15వ ఫైనాన్స్ నిధులతో చేపట్టనున్న సీసీరోడ్ల పనులకు ఎంపీపీ జెల్లా ముత్తిలింగం మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పోరెండ్ల సునీత, సర్పంచ్ గడుసు అనితసుధీర్‌రెడ్డి, నాయకులు ఎంపీటీసీ మాద యాదగిరి, నాయకులు సుంకరబోయిన నర్సింహ, పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, గడుసు శంకర్‌రెడ్డి, బురుగు శ్రీను, చెరుకు యాదగిరి, మధు, అంజన్‌కుమార్, శివశంకర్, రాజు ఉన్నారు.

చిట్యాల: నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. మండలి చైర్మన్‌ను చిట్యాలలో బీఆర్ఎస్ నాయకులు కలిసి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనమా వెంకటేశ్వర్లు, పల్లపు బుద్ధుడు, గుండెబోయిన సైదులు, తేరటుపల్లి హనుమంతు, దేశపాక రాజేష్, వాసా విద్యాసాగర్ పాల్గొన్నారు.

వేములపల్లి: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీపీ పుట్టల సునీత అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం టీఎస్‌యుటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంఈవో బాలాజీనాయక్‌తో కలిసి ఆవిష్కరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. బదిలీలు, పదోన్నతులకు కూడా కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మేక చంద్రశేఖర్, టీఎస్‌యుటీఎఫ్ మండల అధ్యక్షుడు కాశీమల్ల నాగయ్య, కార్యదర్శి నగేష్‌నాయక్, సూపరింటెండెంట్ నర్సింహ, ఉపాధ్యాయులు కృష్ణయ్య, రవీందర్‌రెడ్డి, అనురాధా, యాదమ్మ, స్వర్ణ, జానకిరాములు, సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

డిండి: మండలకేంద్రానికి చెందిన కటికర్ల సవారీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, మేకల కాశయ్య, లక్ష్మణ్, హరిబాబు, శ్రీను, శ్రీను ఉన్నారు.

చిట్యాల రూరల్: టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యురాలిగా మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకురాలు పాపని వనజ వాసుదేవ్ నియమితులయ్యారు. టెలికాం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకానికి పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

పెద్దఅడిశర్లపల్లి : దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌ను పెద్దఅడిశర్లపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అధ్యక్షుడు సంఘం నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విడియాల రామయ్య, దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వీరమళ్ల పరమేష, దోడ్డి లక్ష్మయ్య, విడియాల బుచ్చమయ్య, మంచాల బాబు, వీరమళ్ల సతీష్, సోమ గున్నయ్య, గట్టు శ్రీను, ఉప్పల కోటి తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కనగల్: శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని మంగళవారం కనగల్ మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు నల్లగొండ క్యాంపు కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కరీంపాష, జడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్, సింగిల్ విండో చైర్మన్లు సహదేవరెడ్డి, శ్రీనివాస్, నాయకులు ఐతగోని స్వామిగౌడ్, కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, బైరగోని వెంకటేశంగౌడ్, వెంకటేశ్వర్‌రావ్, వంగాల వెంకట్‌రెడ్డి, సతీష్‌యాదవ్, మండలి పరమేష్ తదితరులున్నారు.

దామరచర్ల: యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమలో భూములు, నివాస గృహాలు కోల్పోయిన స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శివచరణ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. భూములతోపాటు ఇళ్లు కోల్పోయిన మండలంలోని కపూర్‌తండా, మోదుగులకుంటతండాలోని భూ బాధితులకు వెంటనే ఉద్యోగాలు కల్పిస్తామని పరిశ్రమకు శంకుస్థాపన చేసే సమయంలో అధికారులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

మర్రిగూడ: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జి జక్కలి ఐలయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సచివాలయంలో మంగళవారం కలిశారు. సామాన్య ప్రజలకు పాలన అందుబాటులో ఉండే విధంగా ప్రయత్నం చేస్తున్నారనే భావన ప్రజల్లో ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వ పథకాలకు ప్రజలకు అందే విధంగా చూడాలని ముఖ్యమంత్రికి తెలిపినట్లు తెలిపారు.

పెద్దఅడిశర్లపల్లి: మండలకేంద్రంలోని స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మూనా, ప్రధాన కార్యదర్శి తిరుమలరావు, శ్రీనివాస్‌రావు, లక్ష్మీనర్సయ్య, సిరాజుల్ హస్సేన్, బాలాజీ, వాల్యా, అనిల్, జనార్ధన్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణయ్య, మల్లయ్య, పర్వీనా, మాధవి, తులసీ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మండలంలోని నెమ్మానిలో హనుమత్ గాయత్రీ యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద అర్చకుడు గుండేపూడి జానకిరామశర్మ, ఉత్తరాపల్లి నర్సింహాచార్యుల యాజ్ఞికంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. హనుమాన్ మాల ధారులు ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట్ల నర్సిరెడ్డి, మాజీ జడ్పీటీసీ అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, వివేకానందరెడ్డి, హనుమాన్ మాల ధరించిన స్వాములు గంట్ల యాదగిరిరెడ్డి, శంకర్‌రెడ్డి, మారయ్య, కంచోజు సత్యనారాయణచారి తదితరులు పాల్గొన్నారు.

